



కేంద్రం కొత్త సాగు చట్టాలు చేసి ఏడాది పూర్తయింది. ఈ సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలు రోజులు.. వారాలు కాదు నెలలు గడుస్తున్న చర్చలు జరుగుతున్నాయ్‌గాని పరిష్కారం తేలడం లేదు. పట్టు వదలకుండా ఆందోళన చేస్తున్న రైతులు సోమవారం నలభై రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేసిన దేశవ్యాప్త బంద్ విజయవంతమైందని రైతు నాయకుడు రాకేష్ తికాయత్ ఎంతో సంతోషం ప్రకటించారు. రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని చెప్పారు. రైతు శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి వుండాలని కోరారు. వీలైనంత తొందరగా రైతు సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిద్దాం.

**ఢిల్లీ నుండి గల్లీ వరకు విస్తరించిన రైతుల ఆందోళనపై రైతుల కష్టాల గురించి నష్టాల గురించి కవుల స్పందన...**

-సంపాదకులు



## వందనం రైతన్న

మనకి అన్నం పెడుతున్న రైతన్నలు
వాళ్ళే దేశానికి నిజమైన రాజన్నలు
ఒక ప్రక్క పంటపై చీడపీడలు
మార్కెట్లలో జలగల్లా దళారులు
తీవ్ర వర్షాభావం కరువులతో రైతుల కళ్ళల్లో వడగండ్లు
పూర్తి రుణమాఫీతోనే తీరును వారి కడగండ్లు
రైతులకు గిట్టుబాటు ధరను కలిగించాలి
ప్రభుత్వపరంగా ప్రోత్సాహం అందించాలి.
ఇవ్వాలి తక్కువ వడ్డీతో వ్యక్తిగత రుణాలు
పండిస్తాడు అధికదిగుబడితో పైరులు
ప్రభుత్వం టెక్నాలజీతో ఆధునిక విజ్ఞానం కల్పించాలి
రైతన్న దాన్ని ఉపయోగించి
నీకున్న పరిజ్ఞానంతో ముందుకు సాగిపోవాలి.
నేలతల్లిని నమ్ముకున్న రైతన్న
కష్టం నష్టం ఎదురైనా సాగిపో ఇక జయం నీదేనన్న
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల రైతుల్లా మారుతుంటే
వారికి ఒక లీడర్‌లా నువ్వోదారి చూపుతుంటే
ఇక మాకేల భయం
నువ్వే మా అందరికి అభయం.

- ఎన్.ఆర్.కె.ఎస్.వి.మూర్తి
సెల్:903583150



## కన్నీళ్ళు కారనీయొద్దు

రైతన్నల కన్నీళ్ళతో
కార్పొరేటోళ్ళ కాళ్ళుకడిగి
పట్టాభిషేకం చేయొద్దు.

అన్నదాతల ఆర్తనాదాల్ని
కర్పూరంగా మార్చేసి
అయ్యవార్లకు హారతులీయొద్దు

కపటపు మద్దతు ఎర వేసి
దళారీల దౌర్జన్యపు దగాలకు
దారులు తెరవద్దు

పార్టీల ఆర్థిక పరిపుష్ఠి కోసం
రైతుల కడుపులో ప్రేగుల్ని
మెలిపెట్టి తిప్పొద్దు

చట్టాల సంకెళ్లు వేసి
నడిరోడ్లపై రైతుల్నిఊరేగిస్తూ
ప్రపంచం ముందు తలవంచొద్దు

న్యాయం చెయ్యండని మొరపెట్టిన
అన్నదాతల గొంతులకి
తను చుట్టిన తలపాగానే
ఉరితాళ్లుగా చెయ్యొద్దు.

భరతమాత కంటి వెంట
కన్నీళ్ళు రానీయొద్దు.



-యం యస్ రాజు
9502032666

## మెతుకుకు యజమాని

పచ్చని వనాన్ని సృష్టించే చేతులమీద
పైశాచిక లాఠీలు కవాతు చేస్తున్నాయి
చెమట చుక్కలతో తడిసిన నేలను
కార్పొరేటు గుర్రాలకు కట్టబెడుతున్నాయి
తన కష్టంమీద తనకు హక్కులేదని
నేలబిడ్డడి నుదిటి మీద మరణశాసనాలు వ్రాస్తున్నాయి
కష్టజీవి ఫలాన్ని గ్రద్దలకు ఆహారంగా వేస్తున్నాయి
అన్నదాత భాగస్వామ్యం లేకుండానే చట్టాలు
శీతలీకరణ గదులలో రాజముద్రలు వేసుకుంటున్నాయి.
ప్రకృతి ప్రళయంలో పాచికలా మారిన బ్రతుకుల మీద
స్వార్థ రాజకీయం చర్నాకోలు దెబ్బలు వేస్తున్నది
మరోవిద్య తెలియని మట్టిమనిషి జీవితాన్ని
నిప్పుల కొలిమిలో కాల్చి వెన్ను విరుస్తున్నది
తరాలు మారుతున్నా మారని తలరాతలకు
తట్టుకోలేని చిరుప్రాణాలు శవాల దిబ్బలవుతున్నాయి
పల్లెలు పట్టుకొమ్మలు, రైతే రాజు వంటి
మూర్ఖబిళ్ళలకు తగిలించి రైతన్నను దోచుకుంటున్నాయి.
రైతంటే ఎవరో కాదు నీ సాటి మనిషి
నువ్వు తినే ప్రతి మెతుకుకు అతడే యజమాని
సమస్య మాది కాదని శూన్యంలోకి చూడకండి
చేయికి చేయందించి చేయూత నివ్వండి
దాతకు, గ్రహీతకు మధ్య దళారి తలారీలెందుకు?
కిసానుకు తోడుకాలేని కుటిల శాసనాలెందుకు?
పండించే వాడికే పంట మీద హక్కులు కల్పించాలి
ఏ శాసనమైనా రైతుబిడ్డకు
రక్షణ కవచం కావాలి.



- శింగరాజు శ్రీనివాసరావు
సెల్: 90522048706

## మూడు చట్టాల రద్దుకై రైతు యుద్ధం

మూడు చట్టాల రద్దు కోసం కనీస మద్దతు ధరల కోసం
ఆందోళన చేస్తువున్నరు అన్నదాతలు ఢిల్లిలోన "మూడు".

వొరం చెక్కి పొలం దున్ని పంటలెన్నొ పండించి
కడుపునిండ తిండి అయ్యి కంటి నిండ కునుకు అయ్యి
మన ఆకలిని తీర్చినోల్లు అన్నదాతలు ఢిల్లిలోన
తమ ఆవేదన చాటుతుండ్రు అన్నదాతలు ఢిల్లిలోన "మూడు"

కల్లం నిండ గింజలున్న పల్లెం లోన మెత్కులు లేక
కలొ గంజి తాగుకుంటు కాలమెల్ల దీసుకుంటు
దేశానికె తిండి పెట్టె అన్నదాతలు ఢిల్లిలోన
మండుతుండ్రు దివిటీలై అన్నదాతలు ఢిల్లిలోన "మూడు"

వెన్నుటెముక రైతు అంటు మన్ను పోసి కప్పుతుంటె
రైతన్నె రాజు అంటు రైతునె సెర పెట్టుతుంటే
ప్రశ్నిస్తున్నారు పాలకుల అన్నదాతలు ఢిల్లిలోన
నిలదీస్తుండ్రు నేతలాను అన్నదాతలు ఢిల్లిలోన "మూడు"

పొలం గట్లు ఎక్కినారు పోరు దారి పట్టినారు
చావో రేవో తేల్చుకోను త్యాగాలకు సిద్ధమయ్యి
దేశానికి దాన్యాగారం అన్నదాతలు ఢిల్లిలోన
మానవ హారంల మారినారు అన్నదాతలు ఢిల్లిలోన

కార్పోరేట్ శక్తులాకు కట్టపెట్టి వ్యవసాయాన్ని
రైతును ఉరి తీసుకుంటు భూమిని తెగనమ్ముకుంటె
భూమి పుత్రులు ఏకమయ్యి అన్నదాతలు ఢిల్లిలోన
భగ్గు మని మండుతండ్రు
అన్నదాతలు ఢిల్లిలోన "మూడు"



-ఉప్పెన
8106073661

## అన్నదాతా! సుఖీభవ!

నాడైనా నేడైనా రేపైనా
పుడమిని నిలబెట్టేది రైతే
ఆవురావురుమనే జనావళి
కడుపుమంటను చల్లార్చేది రైతే.
తన తల్లి ధరిత్రి తండ్రి ప్రకృతి
కాని తోటి మానవులే తోడేళ్లవంటి తమ్ముళ్లు
పాలకులే కిరాతక దుష్కృతాసురులు.

పపంచానికి పచ్చదనపు దుప్పటి కప్పే రైతు
ఎరుపెక్కిన కళ్లతో ఆగని కన్నీళ్లతో
నిస్సహాయ నిశ్చేష్టుడవటం
మనుష్యకోటి దిక్కుమాలిన తనం
జనులందరి కడుపులు నింపేవాడు
తన కడుపెండగొట్టుకొని బతకడం
రాజ్యాంగాల సిగ్గుమాలినతనం.

దేశానికి వెన్నెముకకే వెన్నెముక నిలబడకపోతే
పురోగతి అంతా అధోగతే
అన్నదాత అవసరాల పట్టింపులేని
ఎజెండాల జెండాలెగరేసే గూండాలు
రైతుల పాలిటి రావణాసురగండాలు
నిత్యం స్వేదాశ్రు తర్పణం చేసే కర్మకుడు
ఆగ్రహిస్తే భూగ్రహం దద్దరిల్లి బద్దలౌతుంది
అన్నదాత అవనికి దేవుడిచ్చిన భ్రాత
అతడు జగతి జనుల క్షుధాత్రాత
రైతన్న సుఖశాంతులతో
ఉండుగాత!



-తుమ్మూరి రాంమోహన్ రావు
9701522234

## రైతు - ప్ర"పంచకాలు

మేఘాలకు
అతని చూపుల లాలస
పుడమి
అతని రెక్కలకు బానిస
॥రైతెన్నటికీ రాజే॥

నైతికత గలిగిన
రైతు కథ వీను
కష్టం కారుణ్యం
రెండూ తెలుస్తాయి
॥ఆదర్శ జీవితమే అతనిది॥

రైతు కళ్ళు
చెమ్మగిల్లినపుడల్లా
చినుకమ్మ వచ్చి
ఓదార్చిపోతుంది
॥అన్నదాత దుఃఖించకూడదనేమో॥

కమతాల కలలు
పచ్చగా పండాలని
చెమట కవితలు
శరీరం నుండి పిండుతాడు
॥హలమే కలమైన ఫలమది॥



-కమలేశ్
9160396596



## పరిష్కారం

కష్టపడెడు వాని కష్టాన్ని దోచెడు
కఠినులున్న వేళ కలియుగాన
చెమట తీయువాడు చవటగా మిగిలియు
మోసగాడు వెలుగు మోదమలర॥

తాను శ్రమను బొంది తనువంత నలిగించి
పంట పండ జేయుపట్టు దలగ
అట్టి తరుణ మందు అరెదెంచి వ్యాపారి
ధరను నిర్ణయించు దర్పముగను॥

నారుబోసి బెంచి, నాటియు, పిండేసి
నీరుబెట్టి కాజి, నిదురమాని
శ్రమను బడ్డయట్టి శ్రామికు కష్టంబు
మాటతోనె దోచు మధ్యవర్తి॥

నీటిలోన దిగిన నేతకు తెలియును
లోతుఎంతొ, దాన లొసుగు లెన్నొ
బయట నిలిచియున్న బాధ్యత లెరుగని
బ్రోకరోడి కెటుల బోధపడును.

ఆది నుంచి బడ్డ ఆర్థిక బరువుకు
తాను బడ్డ శ్రమను తరచి "కలిపి॥
ధరను నిర్ణయింప ధరణిని రైతన్న
లాభపడగ వచ్చు "లాసు"లైక॥

ధరను నిర్ణయించు దారికి రైతన్న
వచ్చినపుడె వాని వగపు దీరు
పచ్చినిజము ఇదని పాలకు లెరిగియు
తోడు నిలువ రైతు తొట్రువడదు.

- పచ్చా లక్ష్మీ పెంచలయ్య
సెల్: 9912822341

## రైతు భావన

ఎండా వానల నడుమ నడుము వంచి పంటల పండించు వాడే రైతన్న! భరతభూమి యందు మతదాతలధికముగ పల్లెలందున్న రైతులే యన్నా! వారి మతమును గతముగా మరచి తుడిచి మురియకు తడియు నయనంబులు! ఇష్టాయిష్టంబుల సంప్రదింపులే స్వాతంత్ర్య ప్రతిరూపం, ప్రజాతంత్ర నిజస్వరూపం. రాజ్యాంగమందు శ్రద్ధ, పారదర్శక పాలనిత్తుమని నిమ్మిబలికిన నాయకుల నమ్మి ఉద్ధరింతురన్న నమ్మకంబున గద్దెను మీకు సిద్ధంబు జేయ బాధ్యతేమో అందరిదాయె! భద్రతేమో కొందరిదాయె! పదిమార్లు పిలచి వలదన్న శాసనం పదిలమనుటలో మీ మర్మమేమి? పయనంబు వీలుకాని మార్గంబుజూపి. దారి భద్రంబని పలుకుటేమి? మా సాధన బాధల నెఱింగి శాసనాల ప్రవేసింపనిండు. కల్యాణకారకంబగు సంపదల నుత్పత్తి, అంకితభావంబు ప్రేమ, శాంతి, నిజాయితి అను నాలుగు వర్ణంబులు పూర్ణ పుష్టియై సమిష్టిగా నిర్దిష్ట సమయంబున ఏకీకృతమైన యట్టి సంఘటిత దేశంబును ప్రతిఘటింప నెవ్వానితరము? అవని పాలక ప్రముఖులార! నిలువుగా ఎదిగి నిలుచు తాటిచెనుట్టును గనుము కాండమే దాని బలము! నిలువుగా యెక్కినా, వాగుపై వేసి త్రొక్కినా ఘనమైన దాని బలమును గనుము! ప్రజాజనిత ప్రభుత్వంబులు ప్రజామనసుల నిల్చువరకే! ప్రజాహితమును కోరు వరకే! సుపరిపాలనంటే ప్రభుత్వ ఆయువు పట్టుయనగ.

- సమత, సెల్: 9493403506



## రైతన్నా

భూమికై పుట్టాడు
భూమినే నమ్ముకున్నా
వర్షంతో హోర్షించాడు
కడుపే నింపేరైతన్నా!!.
తనతల్లి ఎవరైన
భూమి పుత్రుడిలా
వెన్నులా ఈదేశాన
అయ్యాడు తల్లిలా!!.
పదివేళ్లను భూమిలోపోనిచ్చి
పంటనే పండించాడు
మనఐదేళ్లను నోటిలోపోనిచ్చి
ఆకలినే తీర్చాడు!!
రైతన్న నవ్వాలంటే
ఎంత కష్టమో
కష్టంతో ఎదగడమంటే
ఎంతటి ఆనందమో!!
పొలం పండాలంటే
జోడెద్దులు దున్నాలి
రైతన్న ఉండాలంటే
వరుణుడే కరుణించాలి!!
ఆలితాళి అంగట్లోఎట్టాలి

విత్తనం విత్తాలన్నా
పురుగులమందు కొనాలి
తాగిప్రాణమే విడిచేరైతన్నా!!
పంటనష్టమొచ్చిన పండకున్నా
కొయ్యకు ఊగాడే
బురదమనిషైన రైతన్నా
ఆలితాళితెంచెసే అన్నధాతుడే!!

ధాన్యముండదు రైతింటా
ధానుడై నిలిచిన
నీరుతప్పదు కంటా
కొయ్యగూకకు ఇకనైన!!

నీవు లేకపోతే
పంట పండేన
నీవే కరువైతే
మన దేశముండేన!!

బీడుభూమైన నీకైపండునన్నా
భూమి నీసొంతం
రతనాలుపండించే రైతన్నా
నీకులేదన్న అంతం!!



-మల్లె రంజిత్ కుమార్
7032650908

## రైతే రారాజు...!

వర్షాలు కురవకపోయినా
పంటలు పండక పోయినా
ఎరువులు దొరకకపోయినా
గిట్టుబాటు పలకకపోయినా
విద్యుత్తు అందకపోయినా
సబ్సిడీలు ఇవ్వకపోయినా
పురుగులమందు కల్తీఅయినా
ఋణాలు తీరకపోయినా
రైతే రాజు...ఎందుకంటే

ప్లాటు అమ్ముకుని
కోట్లుదోచుకునే
నాయకులు సేవకులైనప్పుడు
పొలం నమ్ముకుని
అందరికి అన్నంపెట్టే
రైతేగా రాజు...!
ఎ.సి గదులలో కూర్చుని
వ్యవసాయ వ్యవస్థ పై
తప్పుడు నిర్ణయాలు తీసుకునే
నాయకులే రాజులైనపుడు
మెతుకు కోసం
బ్రతుకు పోరాటం సాగిస్తున్న
రైతే రారాజు!



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240



## అణచివేతలో రైతన్న

చట్ట వ్యతిరేక నిరసనకు
అడ్డుగోడలు నిరంకుశ వైఖరులు
ఉద్యమస్ఫూర్తి కొలది ఊపంది
ఊరట కలుగుతుందనే రైతన్న!

వేసవి వడగాల్పుల విరసనలో
వాన జల్లులో తడిసిన వలస పక్షి
పొగమంచు బారిన బడుగు కీటకం
చీడ పట్టిన చెక్కు చెదరని సంకల్పం
మెట్ట మడి మీద సాగుకుద్యమించిన
అన్న విధాతకు నమో నమః.

కరెంటు ఇంటర్నెట్ ఆహారం
నీటి సరఫరా శౌచాలయం విధ్వంసం
ట్రాక్టర్ల క్రింద నలిగిన మట్టి బొమ్మలు
వెన్నెముకల క్రింద అంపశయ్య
అధర్మ అన్యాయం దురాగత ఏలిక
వధ్యశిలపై బలిపశువై నిర్దాక్షిణ్య స్థితి లో రైతన్న
కత్తి కంటే క్రూరమైన యోచన!
హింసాత్మక చట్టం మనలేదు ఎక్కువ కాలము!

మహిష మస్తిష్కపు పొర్ల్యాలపై
క్రమ్ముకున్న మదబలిసిన దుర్నీతి
ఆధిపత్య శూరత్వం అరాచకత్వం
హానికి హామీలేక చట్టబద్ధం
చేయలేని హెచ్చరిక!
రైతన్న ఒక్క సాలు సాగు నిరసిస్తే
మెతుకుల సారం
నోటికి అందేది మట్టి బెడ్డనే!



-సయ్యద్ జహీర్ అహ్మద్
9505152560

## నాగేటి చప్పుడు

ఇప్పుడు ఆకాశం బెట్టు చేస్తుంది
అరిగిపోయిన చుక్కలతో
చితికి పోయిన చందమామతో
పంచేదంతా వెన్నెలేనని
బతుకు తెల్లవారిపోయే మాటలు చెబుతుంది.

కృష్ణ బిలాల చట్టాలు రాసుకుని
తారలుగా తరలి రమ్మని
తీరిగ్గా తోరణాలు కడుతుంది

తిరస్కార చీకట్లు కమ్ముతుంటే
చర్చల సూర్యుడిని నేలకు దింపి
ఆకలి చెలమలతో ఆటలాడుతుంది

నేలంతా ఒకటే పోరాటం
గాలి పిడికిళ్ళు బిగబట్టి
ఉదాసీన మబ్బుల్ని చెదరకొడుతుంది.

మట్టి గుండెలో నుంచి
నాగళ్ళ చప్పుళ్ళు బయటకొచ్చి
నింగి అదిరిపడేలా నినదిస్తున్నాయి

నిలువెల్లా సహనాన్ని నింపుకుని
ఎప్పటికైనా భ్రమల గగనాన్ని
ఇలకు పరిచయం చేస్తుంది

పిడికెడు ముద్దుపై పంతం పడితే
పుట్ట గతులుండవని
పదే పదే హెచ్చరిస్తూ...
పోరాట బాటలై విచ్చుకుంటుంది



-నల్లు రమేష్
9989765095




## రైతంటే అన్నం పెట్టే అమ్మ

రెక్కలు ముక్కలు చేసుకొని
బురద నుండి బువ్వను తీసి
ప్రపంచానికి పంచుతున్నా
గొడ్డు గోదతోటి గోసపడుతున్నా
హాలికుల అంతస్తు అధమమే
జీవన సాగరం ఛిద్రమే

ఆరుగాలం కట్టబడి
రత్నాల సిరులు రాశులు పోస్తే
పదికొన్నోడు పది నిమిషాల్లో నే
వందకమ్ముకొని పందికొక్కవుతూ
ఖరైదైన కార్లల్లో తిరుగుతుంటే
అరిగిన పాదరక్ష కాలతో
ఎండకు ఎండుతున్నాడు
పేగులను ఆరబెట్టుకుంటున్నాడు.

ప్రకృతి ప్రకోపించినా
నీరు పైరును నిండా ముంచినా
నకిలి విత్తనపోడు నట్టేటముంచినా
పురుగు మందులోడు పుట్టి ముంచినా
పుడమిని చీల్చుకొని తన్నుకొని

మొలకెత్తే మొలకలా
భవిత పై
ఆశల సౌధాలు పేర్చుకుంటాడు
పుడమిని ఎదలో పూజించుకుంటాడు

ఏరికోరి ఎన్నుకున్న ఏలికలు
రైతన్న కాళ్ళలోకి కట్టెలు విసురుతున్రు
పచ్చని పైరులో చిచ్చు పెడుతున్రు
రైతన్న గుండెలో
గుణపాలు దించుతున్రు
రైతన్న కడలిని ఎడారి చేస్తున్రు.

రైతంటే అన్నం పెట్టే అమ్మ
ఆర్థిక రంగానికి రథసారథి
కల్చర్ కు నిజమైన వారధి
పని విలువ తెలిపే నేర్పరి
పుడమిని కాపాడే రోహితుడు



- తాటిపాముల రమేష్
7981566031




## అతను లేనిదే ప్రపంచం లేదు

అతని పది వేళ్ళూ
మట్టిలోకి వెళ్ళినప్పుడే
మన ఐదు వేళ్ళూ
నోట్లోకి వెళ్ళేది
మనం తినే ప్రతిముద్దా
ప్రతి మెతుకు వెనుక
అతని అవిరళ కృషి
అసమాన ప్రతిభ
అకుంఠిత దీక్ష
అందరి కళ్ళకు కనిపించకున్నా
స్పందించే హృదయాల ముందు
నడయాడుతూనే ఉంటాయి
నాట్లు వేసినప్పటినుండీ పడే పాట్లకు
కోతలు కోసే నాటికి ఉపశమనం కలిగినా
కోతలు కోసే పాలకుల
ప్రగల్భాలూ, ప్రలోభాలతో
అది కాస్తా ఆవిరై పోతుంది
కర్షకులకు నిన్నటిదాకా తెలిసిందల్లా
సేద్యం చేస్తున్న క్షేత్రాన్ని నమ్ముకోవటం
చేతికొచ్చిన పంటను అమ్ముకోవటం
జనం ఆరగిస్తుంటే ఆనందించటం
ఇప్పుడే తెలిసింది

ఎన్నెన్ని కార్పోరేట్ గద్దలు
తమ శ్రమను పొడుచుకు తినటానికొచ్చి
వాలుతున్నాయో! అని
దేశమంటే మట్టికాదు... సరే
దేశమంటే కార్పోరేట్లేనంటూ
వల్లించే పెద్దలకగుపించేలా
ఢిల్లీ వీధుల్లో తిష్టవేసినా
చూసీ చూడనట్లు ముందుకు పోతున్న
యంత్రాంగం పని పట్టటానికి
ఎప్పటికైనా జనవాహిని దూసుకొస్తుంది
రైతన్నలకు అండగా
లక్షాధికారులైనా బిక్షాధికారులైనా
అతను పెట్టే అన్నం తినే వారే
అతను లేనిదే ప్రపంచం లేదు
ఆ సత్యాన్ని గుర్తించినప్పుడే
అసలైన రైతు భారతం ఆవిర్భవిస్తుంది



-పొత్తూరి సుబ్బారావు
సెల్:9490751681




## దేవదూత

పట్టెడన్నం పెట్టే రైతు వెతలు
మాటలతో తీరునా!
బురద మడే గుడిగ తలచు
రైతు కథ మారేనా!

పిడికెడు గుండెలో
పుట్టెడు యోచనలు
ఆ అడుగుల సవ్వడిలో
పంటచేల సరిగమలు..

జగానికే వెలుగునిచ్చు
సూర్యుడిలా అన్నదాత
జనావళి ఆకలి తీర్చే
అచ్చమైన దేవదూత

తన చెమట తడి ని
సిరిగ మలిచి
కష్టాలకు ఎదురు నిలిచి
ఆహారం అందించే రైతు కు
బాసటగా నిలబడుదాం
బాధలన్ని పంచుకుని
అండదండగా ఉందాం...



-వెల్మల జయపాల్ రెడ్డి
9441168976

## ఎన్నియ్యాలో... ఎన్నియ్యాలో

పల్లవి: ఇండియా యెదమీద
ఆకుపచ్చ జెండా
జనం గుండెనిండా
రైతు పోరు జెండా

ఢిల్లీ రైతు పోరుకెన్నియ్యాలో...ఎన్నియ్యాలో
ఎల్లి వద్దాము ఎన్నియ్యాలో...ఎన్నియ్యాలో

చరణం1: కాలమే మారెను
యవుసమే ఏడ్సేను
అప్పుల తిప్పల్లో
రైతు కుప్పకూలే
రైతు సావులతో ఎన్నియ్యాలో...ఎన్నియ్యాలో
కాలమే గడిసెను ఎన్నియ్యాలో...ఎన్నియ్యాలో
చరణం: కమ్మనీ మాటలతో
కార్పొరేటొడొచ్చె
ఏలోటోళ్లకు ఎరేసి
పాడు చట్టాల్ దెచ్చే

ఏర్లతో యవుసాన్ని ఎన్నియ్యాలో...ఎన్నియ్యాలో
పీకి వేస్తున్నాడు ఎన్నియ్యాలో...ఎన్నియ్యాలో

చరణం:గుండెని బిగపట్టి
రైతు బిర్రున లేసే
సచ్చినా బతికినా
పానమొకటని నిలిసే

చట్టాల రద్దుకు ఎన్నియ్యాలో...ఎన్నియ్యాలో
ఢిల్లీ యుద్ధమాయె ఎన్నియ్యాలో...ఎన్నియ్యాలో

చరణం: దేశాకలిని జూసి
పెరిగే మీలో కసి
బారికేడ్ల విసిరేసి
బాంబుల నలిపేసి

నిర్బంధాలనెదురించి ఎన్నియ్యాలో...
ఎన్నియ్యాలో
నినాదాలు ఐనరు ఎన్నియ్యాలో...
ఎన్నియ్యాలో

చరణం: లక్షల కవాతు
ఢిల్లీ చుట్టుముట్టే
ట్రాక్టర్ నాగళ్లతో
కలుపు మొక్కల కూల్చే

మీ పోరు నిశ్వాసలో ఎన్నియ్యాలో...
ఎన్నియ్యాలో
కార్పొరేటోని శ్వాసాగు ఎన్నియ్యాలో...
ఎన్నియ్యాలో

చరణం6: ఎర్రకోట మీద
ఎగిరే రైతు జెండా
చరిత్ర యెద మీద
మీ పేరు సల్లగుండ

ప్రజలు చరిత్ర ఎన్నియ్యాలో...
ఎన్నియ్యాలో
నిర్మాతలై నిలిసే ఎన్నియ్యాలో...
ఎన్నియ్యాలో



-అమృతరాజ్
9505094032













# గాంధీ నానీలు

ఆ రెండే బోధలు
సత్యం,అహింస
గాంధీజీని
మహాత్ముడన్నది..

ఆ కొల్లాయి
కట్టిన నిరాడంబరతే
జన హృదయాలను
కొల్లగొట్టింది.

ఆ ఆచరణ
హరిజనోద్ధరణ
సమతా భావం
ఆదర్శమయింది.

ఆ బోసినవ్వులే
శాంతి పూలయి
స్వతంత్ర భారత
చరిత్ర రాసింది.

ఆ చేతి కర్ర
దాస్య విమోచనకై
దీక్షా దండమై
ఉద్యమాలు నడిపింది.

ఆ రెండే చేతులు
చరఖా తిప్పి
చేనూలు వడికి
గ్రామాభ్యుదయం కోరింది.



–డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి
9849331554

# గాంధీ జీవనం - మనకు ఆదర్శం

ఆధ్యాత్మిక వేత్త,సమాజ సంస్కర్త తత్వవేత్త,
నైతిక రాజకీయ ప్రవక్త
కర్మ యోగి, నిష్కామ యోగీశ్వరుడు
హిమగిరి సముండు గాంధీ మహాత్ముడు.

సత్యం ధర్మం శాంతి అహింస
గాంధీజీ జీవన రథ చక్రాలు
అవే మనకు మహత్తర వేదాలు
మన జీవన గమ్యానికి మార్గాలు.

హిందు ముస్లిం భాయి భాయని
సహోదరత్వం నెలకొల్పాడు
హింస ద్వేషం మనకు తగదని
శాంతిసందేశం వినిపించాడు.

సత్యమార్గమే ధర్మ మార్గమని
ఆచరించిన ఆదర్శ పురుషుడు
స్వరాజ్య సమరానికి పిలుపునిచ్చి
అహింసతో సాధించిన మహనీయుడు.

గాంధీ మాటే కావాలి మనకు వేదం
గాంధీ బాటే కావాలి మనకు మార్గం
గాంధీ స్ఫూర్తి ఇవ్వాలి మనకు ధైర్యం
గాంధీ జీవనమే అవ్వాలి మనకు ఆదర్శం.



– కందాళం రజనీకృష్ణ
సెల్:9487708043

# మరొక మారు

నీ నడవడి కడు శ్లాఘ్యము,
నీ నుడులౌ శ్రుతులు,స్మృతులు నిర్మల చరితా!
వేనోళ్ల పొగడవలె నిను,
కానము నీవంటి యొరుని, గాంధిమహాత్మా!

నడిపించినావు మమ్ముల,
విడివడె సంకెళ్లు,దక్కె స్వేచ్ఛ,యథేచ్ఛన్
నడకలు మొదలై,విచ్చల
విడియై,నడవడికలందు విలువలు తరిగెన్

నీ యాదర్శము మహితము,
నీయం దభిమానమున్న, నీ యుద్బోధల్
స్వీయాభివృద్ధిలో బడి
మా యేలిక లనవరతము మరచెదరయ్యా!

చెప్పితి వెన్నో 'సబబులు',
చెప్పుటయే కాదు,వాని చేసితివి కదా!
ఇప్పటి మా నాయకులకు
చెప్పుటయే కాని,రాదు చేయుట తండ్రీ!

ప్రతి నేత ప్రజాక్షేమమె
ప్రతిక్షణము తలచి,పాటుపడవలె నను నీ
హితవచనము మా నాయక
తతి మెచ్చును గాని,విధిగ తలచదు దానిన్

ప్రజ లెన్నుకొన్న నేతలు
ప్రజలకు బాధ్యులుగ నుండవలెనను నిజమున్
ప్రజలెల్ల రెరుగ రిట,నిక
ప్రజాప్రతినిధులకు నేమి పట్టు మహాత్మా?

ధనవంతుడె నాయకు డిట,
తన స్వార్థమె చూచుకొనును,తలచడు ప్రజలన్
ధనము ప్రజాస్వామ్యమునకు
పెను ముప్పై చెరచుచుండె విలువలు బాపూ!

వెదజల్లి ధనము నేతలు,
పదవులు దక్కించుకొనుచు బాహాటముగా
ఇదియె ప్రజాస్వామ్యమ్మని
వదరుట పరిపాటి యయ్యె ప్రస్తుతము పితా!

నీ నేర్చిన, నీ నేర్పిన
మానిత ధర్మమును గూర్చి మాటాడుటకున్
ఈ నేతలందు నర్హులు
గా నెందరు నిలిచియుండగలరు మహాత్మా?

విలువలకు నీళ్లు వదలిన
ఖలులకు పట్టమ్ముగట్టి, కటకట పడినన్
ఫలితము శూన్యము!తగువా
రల నెన్నుకొనంగవలయు ప్రజ విజ్ఞతమై!

ఈ దేశ రాజకీయము
లాదర్శములను త్యజించి,అతి హేయములై
చీదర పుట్టించును, మ
ర్యాదయు, మన్ననయు కానరా దొకయింతన్!

అరుదగు నీ యాదర్శము
కొరవడె నీనాటి నాయకులలో, ప్రజ లె
ల్లరు నష్టపోవుచుండిరి,
సరిదిద్దగ మరొకమారు జన్మించు మయా!



–హెచ్.ఆర్. చంద్రం
సెల్: 9493248053

# మహాత్మా...!మళ్ళీ ఎప్పుడు పుడతావ్...?

మహాత్మా !నేటి ప్రజాస్వామ్యంలో
భారతావని అధిక జనాభాతో
ప్రసవ వేదన పడుతోంది
'అక్రమం' విక్రమార్కుడిలా
రాజ్యమేలుతోంది
'అధర్మం' అంగడి సరుకులా
అమ్ముడు పోతోంది
'అసత్యం' ప్రతి నిత్యం
రామనామ స్మరణ అవుతోంది
'అహింస' మాట దేవుడెరుగు
హింస లేనిదే నిద్రపోవడం లేదు
ఉపాధి లేక యువత
అడ్డదారి పడుతోంది
నీవు సాధించిన స్వరాజ్యం
నేడు అయినది 'సురా'జ్యం
ఆడది అర్ధరాత్రి ఒంటరిగా కాదు
పట్టపగలు జంటగా పోయినా
రక్షణలేదు
స్వతంత్రం ముందు కన్నా
ఇప్పుడే అవసరం నీ జననం
ఎదురు చూస్తున్నారు
కోట్ల భారతీయ జనం
అందుకే....
మహాత్మా !
మళ్ళీ ఎప్పుడు పుడతావ్ ?



–కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

ప్రముఖ కవి, వక్త ఆచార్య కసిరెడ్డి 1969లో మహాత్మాగాంధీపై రాసిన శతకం గాంధీజీ శతజయంతి సందర్భంగా 1971లో ప్రథమ ముద్రణ జరిగింది. కమలాకర భారతి సౌజన్యంతో జాతీయ సాహిత్య పరిషత్, భాగ్యనగర్ శాఖ తెలంగాణ వారి ఆధ్వర్యంలో గాంధీజీ 150వ జయంతి సందర్భంగా 2018లో ద్వితీయ ముద్రణ జరిగి పలు పాఠశాలలోని విద్యార్థులకు అందజేశారు.

అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా ఈ 'గాంధితాత శతకం' నేటినిజం పాఠకుల కోసం ప్రచురిస్తున్నాము.

– సంపాదకులు






– ఆచార్య కసిరెడ్డి
సెల్: 9866956250

బుద్ధ దేవుని భూమిలో పుట్టినాడు
శుద్ధ సాత్విక సామ్రాజ్య సుగుణ ధనుఁడు
మానవత్వైక దివ్యాత్మ మహిత యశుఁడు
కరుణమూర్తి భరతనేత గాంధీ తాత.

పదునెనిమిది వందల యరువదియుమీద
తొమ్మి, దక్టోబరున రెంట తోషమంద
పోరు బందరు గ్రామాన పుట్టినాడు
ఘనుఁడు మన తాత మన నేత గాంధితాత.

తండ్రి కరుము చందు పుతలీ తల్లి పేరు
మొదట మోహన దాసని మోహనముగ
పిలువబడినాడు తరువాత కొలువఁబడెను
కాలచక్రాన మన యొక్క గాంధితాత.

రామనామము జపియించరాదు భయము
అనుచు బాలకులితో చెప్పె నమ్మగారు
వేద్య మదియయ్యె నతనికి వేదముగను
గాఢముగ జపియించెను గాంధితాత.

పర్యవేక్షకు లొకనాడు పాఠశాల
కరుఁగు దెంచఁగ పంతులు పరుని చూచి
వ్రాయుమని చెప్ప తగదని వ్రాయలేదు
కల్ల తలచని మొనగాడు గాంధితాత.

శ్రవణ చరితము విని, హరిశ్చంద్ర కథను
నాటకంబుగ తిలకించె, నాటినుండి
తండ్రిపై భక్తి సత్యంబు తలఁచి నేర్చె
కలలో కల్ల కనలేదు గాంధితాత.

సంప్రదాయాలు మదిఁగోరి చదువుచున్న
బాలకునకు కస్తూరితో లీల వోలె
పెండ్లి యొనరించి నారలు ప్రేమతోడ
కరము గ్రహియించె చిన్నారి గాంధితాత.

బాలజ్ఞానము పోనట్టి బాల యామె
బాల జ్ఞానము లేనట్టి బాలుఁడతఁడు
బొమ్మ పెండ్లిండ్ల వోలెనే మురిసినాను
కమ్మగా కలల్ కనినాడు గాంధితాత.

దుష్టులైనట్టి మిత్రులతో చరించి
మాంసమును తినె, పొగ త్రాగె, మఱచె పిదప
తస్కరించెను డబ్బులు తప్పునెఱిఁగె
కలత పడినాడు మదిలోన గాంధితాత

మదిని రేగిన వేదన మఱువ లేక
తండ్రికినిఁదెల్ప చేసిన తప్పులన్ని
కాగితముపైన వ్రాసెను కపట మొదలి
కరుణఁజూపఁగ ముదమందె గాంధితాత

దేశ వ్యవహారములనన్ని తెలిసికొనును
పాల కమ్మన్య యవినీతి ప్రభలు కనును
పాలిపోయిన ప్రజఁజూచి జాలిపడును
కలుగఁదలఁచును స్వేచ్ఛను గాంధితాత.

పదియు నాఱేండ్లు వచ్చిన ప్రాయమందె
తండ్రి గతియించె దుఃఖించె తాళలేక
భారము పడెను హెచ్చెను బాధ్యతలును
కాని వెనుకంజ వేయడు గాంధితాత.

సాధ్వి కస్తూరి కొక బిడ్డ చనియె పుట్టి
దుఃఖమునకును తోడయ్యె దుఃఖమొకటి
తగిలినట్టి పాదమునకె తట్టు తగులు
కాని చలియించగాలేదు గాంధితాత.

మేలు చదువులు చదువగా మిత్రపరులు
ఆంగ్లదేశాని కేగుట హాయి యనిరి
అన్నగారును ముదమున యానతిచ్చె
కాంక్ష తెలిపెను వెళ్ళగ గాంధితాత

మొదట ననుకూల కాలంబు పొందలేక
కష్టపడినాడు తరువాత యిష్టపడెను
ఆంగ్ల సంస్కృతి గ్రహియించె అణగియుండె
కలిసి మెలిసి మెలఁగినాడు గాంధితాత.

ఆంగ్ల వ్యవహారములను దాననుసరించి
తప్పుచేసిన విధముగా తనియకుండి
పూర్వ వ్యవహారములను దాబుద్ధి నిలిపి
కలత నొందక నుండెను గాంధితాత.

మూఁడు వర్షాలు చదివెను పొందికగను
తను బారిష్టరైపోగ తరలినాడు
న్యాయవాదిగ, తన భూమి నంతగాంచ
కౌతుకంబుగ నరుదెంచె గాంధితాత.

ఇంటికిని రాకపూర్వమే మింటికేగె
కన్నతల్లి, దుఃఖంబునే కాంచినాడు
గాఢ వేదనాలహరిలో కనలినాడు
కరము కుందెను దుఃఖపిల్లె గాంధితాత.

న్యాయవాదపు వృత్తిని నడిపినాడు
కొన్ని నాళ్లు బొంబాయిలో కొంతవరకె
సాగినది వృత్తి పొట్టయు జరగకుండె
కాని నడిపించె కొన్నేళ్లు గాంధితాత.

న్యాయవాదిగ తమ కేసు నడపుటకును
దక్షిణాఫ్రికయందు వర్తకులు తలఁచి
అడిగినంతనె యిల్లునిల్లాలి నొదలి
కదలివెళ్ళెను ఘనుఁడైన గాంధితాత.

దక్షిణాఫ్రిక వెళ్ళి సుశిక్షకుండు
భారతీయుల తెలవారు బానిసలుగ
చూచిటెఱిఁగెను భేదాలు చూచినాడు
కుంది నిలువెల్ల కంపించె గాంధితాత.

స్వయముగా జరిగిన పరాభవము చేత
తోటి వారల బాధలు తోచె మదికి
ఆ యమానుష కృత్యములంత మవఁగ
కాంచుచుండెను దారులు గాంధితాత.

బానిసత్వంబుఁ వాపఁగ భారతీయ
కార్మికుల నొక్క సంఘంబుగా నొనర్చె
అదియె 'నేటాలు కాంగ్రెసు'– అనిరి జనులు
కార్యశూరుఁడు తానయ్యె గాంధితాత.

క్రౌర్య కౌటిల్య శాసన కఠిన తలను
విరుగఁగొట్టగఁ తలఁచి తావినిచినాడు
ఐకమత్యమే ధ్యేయము ననుచు బాపు
గట్టి యత్నాలు చేసెను గాంధితాత.

ఆఫ్రికాయందు మూఁడు వర్షాలు గడిచె
ఇరువురు కుమారులను జూచి యిల్లు చూచి
వత్తునంచును నచ్చుట బాసచేసి
కదలి వచ్చెను మోదాన గాంధితాత.

ఆఫ్రికా భారతీయుల యదుపులన్ని
పత్రములపైన తా వ్రాసి పంచిపెట్టె
రంగు భేదాలు పాటించు హంగు తెలిసె
కాలక్రమమున మేల్కొల్పె గాంధితాత.

అప్పుడు వ్యాపించె ప్లేగు బొంబాయిలోన
దాని నాపగ బాపు నధ్యక్షు చేయ
అపరి శుభ్రతయే మూలమంచు చాటె
కార్య శూరత్వమును జూపె గాంధితాత.

భ్రాతృభావము చూపించె భరతనేత
శాంతి యైక్యతలను జాటె శాంతిదూత
ప్రజల యనురాగమును బొందె సుజనుఁదనిరి
ఖ్యాతి గడియించె మన యొక్క గాంధితాత.

భార్యయు సుతులు వెంటరా మారె దక్షి
ణాఫ్రికాకు, బ్రిటిషు వారలధిక కోప
తాపములచేత నిందలు మోపినారు
కాని శాంతినె వాంఛించె గాంధితాత

సేవ రోగుల కెంతయో చేయువాడు
బాధలను మాన్ప కష్టాలు పడెడివాడు
దీనజనసేవ చేయుచు తిరుగువాడు
కార్మికుల కష్టములు గాంచు గాంధితాత

సుతులు హరిలాలు మణిలాలు సుతలులేరు
రామదాసేమొ మూడవ ప్రేమ సుతుఁండు
చివరి పుత్రుఁడు దేవదా శిష్టజనుఁడు
కరము సంతోషమున నుండె గాంధితాత.

తనయుడుపుల తానె యుతుకు కొనెడినాడు
తనదు క్షౌరము తాఁజేసి కొనెడినాడు
ఇంటిలోనున్న వారల కిదియె నేర్పె
ఘనస్వయంసేవకుండయ్యె గాంధితాత.

అనుభవములను జీర్ణించు కొనెడివాడు
ఆచరించెడి యత్యంత యమిత యశుఁడు
ప్రజల యభిమానమునుగొన్న ప్రభువతండు
గౌరవము పొందె నంతట గాంధితాత.

బోయరను యుద్ధమందున గాయపడిన
బ్రిటిషువారికి సేవలు రేపుమాపు
చేసి చేయించి మనయొక్క వాసి చూపె
కలుపుగోలు మహిమ చూపె గాంధితాత.

మానవత్వమ్ము విడిచి యమానుషముగ
సంచరించిన వారితో మంచిగా, చ
రించి చట్టముల్ తిరుగ వ్రాయించినాడు
క్రాంతి మార్గము విడనాడి గాంధితాత.

భగవదాదేశమౌ గీత పరగ చదివి
అన్ని పనులలో సూత్రాల నాచరించి
పాపభీతి కలుగుననె భక్తి వలన
కాని పరమత సహనుఁడు గాంధితాత.

భగవదాదేశమౌ గీత పరగ చదివి
అన్ని పనులలో సూత్రాల నాచరించి
పాపభీతి కలుగుననె భక్తి వలన
కాని పరమత సహనుఁడు గాంధితాత.

ఆఫ్రికాలోని జూలూసు లాంగ్లజనుల
కెదురు తిరుగగ సహకార మెంతొ చేసి
సర్వ జనములపైఁ జూపె సానుభూతి
గ్రామములు నెలకొల్పెను గాంధితాత.

బలము కలిగినవాడు నిర్బలులనెంతొ
బాధపెట్టుడు రైనను భయము వలదు
శాంతియుతమైన యుద్ధము సాగవలెను
క్రాంతి వలదని చెప్పెను గాంధితాత.

న్యాయరక్షణ కొఱకు నన్యాయములను
ఎదురుకొని శాంతియుతముగ నేగవలయు
మనిషి హక్కులు నియమాలు మఱువరాదు
కనులు తెరువగ చెప్పెను గాంధితాత.

శాంతిపోరాట మందున చావుకైన
చెదరి బెదరుట తగదని చెప్పినాడు
మనిషి హక్కులు కాపాడి మనుట మేలు
కాన మఱువకుఁడని చెప్పె గాంధితాత.

తప్పు చేయఁగా నొక్కరు తనదిగానె
భావనముచేసి తానుపవాసములను
చేసి మార్చును వారల చేతములను
గౌరవములందు ప్రజలచే గాంధితాత.

స్వార్థమే లేని చిక్కని భావములను
ఆగ్రహంబులు కలుగని యాచరణను
నడిచినడిపించువాడు క్షణాలమీద
కార్యదక్షుఁడు పూజ్యుఁడు గాంధితాత.

నల్లవారని తెలవారు న్యాయ మొదలి
దక్షిణాఫ్రిక యందున కక్షతోడ
కష్టపెట్ట సత్యాగ్రహ మిష్టముగను
కరము పట్టెను మేల్కొల్పె గాంధితాత.

భరత జనులిటుల చరించ బాధ్యుఁడనుచు
భరతనేతను తాతను బంధనముల
కారగారాని కంపగా క్రౌర్యతవిడి
కలుగు నిజముకు జయమనె గాంధితాత.

బందిఖానలు నిండిన వందువలన
ఎదియె ఒప్పందమును జేసి వదలినారు
ఒప్పుకొనకుండ కొందఱు తప్పునడువ
అందఱను శాంతితో మల్పె గాంధితాత.

కాలచక్రాన నీ విధి కాలిపేలి
దక్షిణాఫ్రిక వదలెను తరలె నిటకు
ప్రథమ విశ్వపు యుద్ధాగ్ని రగులుచుండె
కదురు చేపట్టెనప్పుడు గాంధితాత.

దేశ సౌభాగ్యమునకు నిరాశ్రయులకు
నిలయములు కుటీరపరిశ్రమలని తలఁచి
నూలు వడికించి నేయించి మేలుకొల్పె
కదురు నాడించె చూపించె గాంధితాత.

అహమదాబాదు తనకెంతొ అనువుకాఁగ
అచట సత్యాగ్రహాశ్రమ మనవరతము
నిలువ కోరుచు స్థాపించె నిలిపె నీతి
గౌరవ పవిత్రమూర్తి యా గాంధితాత.

ఆశ్రమంబెంతొ నుత్తమా దర్శములతొ
అంటరానట్టి తనమును నఱుగఁద్రొక్కె
సంప్రదాయాల వ్యక్తులు శత్రులైన
కాతరత్వము గనలేదు గాంధితాత.

దేశపాలకులైన యింగ్లీశు వారి
కుర్వివెచ్చంగ తోడ్పడె యుద్ధమందు
సేవచేసిన స్వాతంత్ర్య మివ్వఁగలరు
కనుక తాచేసె చేయించె గాంధితాత.

ఎంత బాగుగ నడిచినా యెంతసాను
భూతి చూపించినా గాని ముత్తెమంత
భారతీయుల కోర్కులు తీరలేదు
కనుక తల్చె పోరాటమె గాంధితాత.

అట్టి పోరాటమందు కొట్లాటలేదు
అట్టి పోరాట మందునే హత్యలేదు
అట్టి పోరాటమందు న్యాయంబు కలదు
గట్టి పట్టుదలతో చాటె గాంధితాత.

అన్న మేలేక మేమున్న పన్నులేల
ఇవ్వమన్నారు జనులెల్ల దువ్వి నిలచి
సమ్మె చేయఁగ పనులయ్యె స్తంభనముగ
కాంచి సమ్మెను ముదమందె గాంధితాత.

కొందఱన్నారు కొల్లాయి కూతలనుచు
అనిరి కొందఱు పిచ్చిపుల్లయ్య యనుచు
ఎవ్వరేమన్న శాంతినే యెంచుకొనెచు
కనలకను బోధనము చేసె గాంధితాత.

మంచి గ్రంథములను నిషేధించగానె
కోరి బహిరంగముగ నమ్మినారు కొనిరి
వచ్చు విప్లవ మాపఁగ వలను కాదు
కారణము నింతకంతకు గాంధితాత.

శాంతి పోరాట మందు నశాంతి రేగె
క్రాంతి వాదులు కొందఱు క్రౌర్యములతొ
హత్య లొనరించి నారప్డు ఆంగ్ల జనుల
కనలి శాంతిని బోధించె గాంధితాత.

ఆవిధంబుగ బార్డోలి యందు జనులు
తిరుగబడినంత కొన్నాళ్లు తిరిగినాడు
సమయ మాసన్నమైనంత చాటినాడు
బంధువయ్యెను ప్రజలకు గాంధితాత.

అన్ని దేశాలు యుద్ధాల యందు మనుఁగ
శాంతిశాంతని శాంతంచు చాటినాడు
సర్వ సౌభ్రాత్రమును కోరె శాంతిదూత
కారణముచేత కలిగెను గాంధితాత.

మద్యపానంబు విడుచుట, ఖద్దరును ధ
రించుట, విదేశ వస్తు బహిష్కరణము
చేయుట, మత సహనములు నాయుధములు
కాగ నడిచెను నడిపించె గాంధితాత.

సత్యమార్గాన నడువంగ చాటిచెప్పె
అమలు పరచె నహింస సిద్ధాంతములను
సాయ మొనరించుటయె యింక చాలుననెను
కావలెననెను స్వేచ్ఛయే గాంధితాత.

ఆశ్రమంబు సబర్మతి ఖ్యాతిగాంచె
జాతి మత విచక్షణ లేక నీతి తెలిపె
ఆ సబర్మతి ఋషియయ్యె వాసిగాంచె
అంధకారము పోఁద్రోలె గాంధితాత.

ఉప్పు పన్నును విధియించు చుండినంత
దండి సత్యాగ్రహంబును దండిగాను
చేసి మన కోర్కులన్నిటిన్ చెప్పినాడు
అంథుల కనులు తెరిపించె గాంధితాత.

తనదు జీవితమంత యాదర్శమవఁగ
ముతక ఖద్దరు కట్టెను ముసలితాత
డంబమెఱుంగని కడు నిరాడంబరుండు
కఠిన నియమాలు పాటించె గాంధితాత.

అతఁడు సతత దరిద్ర నారాయణుఁడు
అతఁడు పఠనుండునైన రామాయణుండు
అతఁడు సర్వజనమున ప్రేమాయణుండు
కారువేరుగ నెవరు మా గాంధితాత.

ఉప్పు సత్యాగ్రహంబుచే నుగ్రులైన
బ్రిటిషు వారలు చెరసాల వేసినారు
అట్టి చెరసాల యతనికి నాశ్రమంబె
కనుక ధైర్యము విడలేదు గాంధితాత.

ఎన్నియో మార్లు నా విధి నేగె జైలు
పూల చెండ్లయ్యె లాఠీల పోటులన్ని
కఠిన చర్యలునయ్యె సుఖానుభవము
కుంది సంతోషపడినాడు గాంధితాత.

ఎంతొచైతన్య మరుదెంచ వింతయేమొ
చట్టములు సడలించిరి పట్టుబట్ట
కాని స్వాతంత్ర్య కాంక్ష యకాంక్షయయ్యె
కాంక్ష రేకెత్తె ప్రజలలో గాంధితాత.

దేశ కాంగ్రెసు సంస్థ పదిలముచేసి
భారతీయుల హృదయాలు పారతంత్ర్య
మునను విముఖత యగునట్లు మూసపోసి
ఖండములు బెదర చరించె గాంధితాత.

స్వనము "క్విట్టిండియా" యని వినిరి కనిరి
భయము పొందిన యాంగ్లులు బాపుజీని
జైలులోవేయ ప్రజలెంతొ యాగ్రహాన
"ఖతలు" లొనరించ వారించె గాంధితాత.

ఇట్టి సమయాన భార్యయు గిట్టినంత
దేశ స్వాతంత్ర్యమునకునై ధీరుఁడైన
బాపు కనలియు జాగ్రత్త వదలలేదు
కఠినుఁడాకాదు దేవుఁడు గాంధితాత.

దేశస్వాతంత్ర్య సమరము తీవ్రరూప
మును ధరించెను, దేశవిముక్తి కొఱకు
పాటు పడుచుండి రందరు పలు విధముల
కారణము మహాత్ముండగు గాంధితాత.

చాల ముస్లిము లున్నట్టి స్థలములన్ని
వేరుగానివ్వ మేమెంతొ కోరుచుంటి
మనుచు జిన్నా తెలిపినాడు, వినయమిద్ది
కాదనెను వేరు వద్దనె గాంధితాత.

ఒక్క దేశాన నుండుచు చిక్కనైన
దేశ మిట్టుల చీల్చ వినాశబుద్ధి
అనుచు నెలుగెత్తి చాటె మహాత్ముకుండు
ఖండనమెకోర దుఃఖపిల్లె గాంధితాత.

మనకు నదియెంతొ మాయని మచ్చ యనిన
భారతీయ సంస్కృతి కది పాపమనిన
ఒక్క తల్లిని చీల్చుట తిక్క యనిన
ఎందు వినలేదు, దుఃఖించె గాంధితాత.

బ్రిటనులో "లేబరులపార్టి" విజయమందె
సానుభూతిని చూపించ స్వాంతమందు
దేశ స్వాతంత్ర్యమున పూర్తి యాశ కలిగె
కలలు ఫలియించె ముదమందె గాంధితాత.

"లీగు" వారల కాంగ్రెసు యోగి వరుల
కలిపి తాత్కాలిక ప్రభుత నిలిపినారు
ముస్లిములవారు వ్యతిరేకములను జూపి
క్రౌర్యములకు దిగ కలంగె గాంధితాత.

వారు వీరిని, వీరల వారి కనుచు
హత్య లెన్నెన్నొ చేసుక హడలినారు
శాంతి కెంతయొ భంగంబు సంఘటిల్లె
కంఠములు తెగ దుఃఖించె గాంధితాత.

ఆయారాచక మెవ్వరు నాపలేదు
బాపు కొంతగా యత్నించి బాపినాడు
రెండుగాచీలె భరతము మొండివలన
దెందము నరుకబడెననె గాంధితాత.

ఒసంఁగినాడు పాకిస్థాను ముసిలిములకు
భారతంబని పిల్వఁగఁ బడునిదంచు
మతము పేరిట రెండుగా మారినంత
కనుల నీరును కార్చెను గాంధితాత.

పందొమిది వందలయు నలుబదియుపైన
ఏడునాగష్టు పదునైదు నాడు మనకు
పారతంత్ర్యంబు తొలఁగెను వచ్చె స్వేచ్ఛ
కాంక్షతీరెను ముదమందె గాంధితాత.

అప్పటికి మత కలహాలు నణఁగలేదు
ఢిల్లిపురమందు జరిగెను లొల్లులెన్నొ
అన్నమును వీడనల్లరు లణంగిపోయె
ఘనయశస్కుఁడు మహనీయ గాంధితాత.

తనదు జీవిత మెంతయోధన్య మవఁగ
వ్రతములను బూని తాను నిరశనుఁడగుచు
క్రుంగి కృశియించిపోయినా కుంద లేదు
మందహాసాలతోగెల్చె గాంధితాత.

తన ధనంబును దేహము తనదు విద్య
దేశస్వాతంత్ర్యమును గోరి దిశలచల్లి
జీవితాంతము త్యాగము చేసినాడు
అంధ జన కరదీపిక గాంధితాత.

కాలినడకనె పయనించి కార్యములను
దిగ్విజయములు సాధించు ద్రిమ్మరీడు
మానవత్వము చూపిన మనిషి యతఁడు
వంతనీయుడు జగతికి గాంధితాత.

శాంతి వచనాలు ప్రవచించు సాధుమూర్తి
బండబారిన హృదయాలు పిండినాడు
శాంతము కరుణ యొకటైన క్రాంతిరాదు
నింద కందఁడు ధన్యుఁడు గాంధితాత.

రెండువందల యేండ్లు పాలించినట్టి
తెల్లవారినె కాకుండ నెల్ల జగతి
నొక్కసారిగ కదలించె బక్కమనిషి
కరములో నూతకఱ్ఱయె గాంధితాత.

ఎవరెనని పోల్చు నతనితో నెవరులేరు
బుద్ధ దేవుఁడె క్రీస్తుయో భువినికలరు
అతని కతఁడేను సాటియౌ యన్యులేల
అందరకు మిన్నయనవచ్చు గాంధితాత.

పందొమిది వందలయు నలుబది యెనిమిది
జనవరి నెల ముప్పదియగు దినమునందు
ప్రార్థనమునకు పోయెను ప్రజల తండ్రి
కాని విధి దాటకుండెను గాంధితాత

అట్టి సమయాన నొకవ్యక్తి యరగుదెంచి
వందనం బిడిపిస్తోలు వరుసతోడ
ప్రేల్చ హేరామహేరామ పిలిచికూలె
కన్ను మూసెను మన తండ్రి గాంధితాత.

మంచి వారిని సృష్టివంచించునెపుడు
అదియె నిజమయ్యె బాపూజి బ్రదుకునందు
కాలమెంతటి కఠినాతి కఠినమౌర
గ్రామజన కల్పవల్లి మా గాంధితాత.

అతని భౌతిక దేహమే సతము మనకు
కానిపింపదు సూత్రాలు కానిపించు
దేవలోకము వెళ్లిన దివ్యజీవి
ఘన యశస్కుఁడు ధీనిధి గాంధితాత.

అతఁడు మరణంబు నొందని యమరజీవి
ధర్మమూర్తియు నతడెంతో ధన్యజీవి
పూతచరితుఁడు భవ్యుఁడు పుణ్యజీవి
గౌరవ పవిత్ర మూర్తి యౌ గాంధితాత.

మూట లేనట్టి ఘనమైన మాటకారి
నీతి మాటలు విడనట్టి నిశ్చయుండు
ధర్మ పథమును విడని మతాలమారి
కామధేనువె మనకెల్ల గాంధితాత.

బోసినవ్వుల తాతయ్య భువనదాత
వాసిగాంచిన తాతయ్య భరతనేత
సమరమనినను గిట్టని శాంతిదూత
కాశికేగిన మా అయ్య గాంధితాత.

మీరలూహించి నటులీ భరతంబు
నిర్మలంబుగ నీతిని ధర్మములను
మోసములు లేకనుండి వికాసమంది
క్రాలుచుండెనా? కాంచుమా? గాంధితాత.

లంచములు హెచ్చె మందిని ముంచువారు
హెచ్చి నారలు బాధలు హెచ్చెనయ్య
ఏమి రాజ్యమొ యేమిటో యేమి యుగనో
కాంచుచుంటివో లేదొ ఓ గాంధితాత.

నాడు శాంతితో కలహాలు నడిపినావు
నేడు తూటాల మాటలే నిండుకొనెను
కోటలును లేవు దాగుట కొఱకు ప్రజలు
కాంచుచుంటివాలేదొ? ఓ గాంధీతాత.ఔ

అయ్య యొకసారి రావయ్య కయ్యములను
ద్రుంచి వియ్యము చేయఁగా దుముకవయ్య
పేదవాడిని, ప్రేమగా పేదలనిన
కాంచి నెరవేర్చు యాశ గాంధితాత.



# నవయుగ కవి చక్రవర్తి 'జాషువా'

కండబలం గుండెబలం
దండిగా గల వినుకొండలో జన్మించిన
ఆంధ్ర సాహిత్య సామ్రాజ్యంలో
మకుటం లేని మహారాజు
విశ్వనాథ సమకాలీకుడు!!

అంటరానితనం వెంటాడినా
ఛీత్కారాలు
ఎదురయిన చోటే
సత్కారాలు పొందాడు
సరస్వతీ దేవి పాదాల చెంత పెరిగి తెలుగు
కళామతల్లి ముద్దుబిడ్డగా ఎదిగి
అగ్రకులాల అవధాన దిగ్గజం చేతే గండపెండేరం
తొడిగించుకున్నాడు!!

పలుకుల రాణి పదములకు దక్కింది ఈ గౌరవం అని
ప్రతిభకు పట్టం కట్టించుకున్నాడు
కళాప్రపూర్ణుడు
పద్మభూషణుడు
కులంతో దూరమయినా
కలంతో జయించాడు!!

జాషువా అంటే
జాళువా అనిపించుకున్నాడు
వడగాల్పు నా జీవితం
అయితే
వెన్నెల నా కవిత్వం అన్నాడు
ఖండ కావ్య రచనలో
అందె వేసినచెయ్యి గజారోహణం చేయించుకున్న
కవి దిగ్గజం!!

కవిత్వమే
ఆయుధంగా
మూడాచారాలపై
తిరుగుబాటు చేశాడు
సంఘ సంస్కరణే
కావ్య ధ్యేయమన్నాడు!!

రాజు మరణిస్తే
రాతి విగ్రాహాల్లో ఉంటాడని
సుకవి మరణిస్తే
ప్రజల నాలుకపై
ఉంటాడని నుడివి
తానే ఒక విశ్వకవి
సామ్రాట్ గా హారతులు అందుకున్నాడు!!

జాషువా కవితాభావాలు చిటికెన వేలేసుకు వచ్చే లేలేత
జవరాళ్లు
ఆంధ్రుల ఘనకీర్తి ని
దిగంతాలకు చాటాడు
నవయుగ కవి చక్రవర్తి
నవయుగ వైతాళికుడు
జాషువా మహాకవి!!



–పరిమి వెంకట సత్యమూర్తి
9440720324

# జాషువా మెరుపులు

గుడ్డిదీపపు వెలుగులోన
గుర్తుపట్టి గబ్బిలాన్ని
వివరించె ఏకరువున
పంచముల దైన్యాన్ని

అవమానాలు భరిస్తూ
కవిగా ఎదిగాడు
ఉపాధ్యాయుడిగా బోధిస్తూ
సమాజాన్ని కడిగాడు

ప్రాచీన పద్యాలలో
ఆధునిక చైతన్యం
బాధా భావధారలో
చూపించె బీదల దైన్యం

కొత్తలోకం కావ్యంతో
కొత్తకోణం చూపించాడు
అర్ధాంగి మరణంతో
ఆమెకు అంకితమిచ్చాడు

దుర్భర జీవితంతో
అనుభవించె పేదరికం
కులమతాల భేదంతో
అవమానాలు అనేకం

గిజిగాని నేర్పుకు
నాస్తికులు ఖిన్నులనెను
శిల్పియొక్క ప్రతిభకు
భళిరే యనిపొగిడెను

ముప్పదిమూడు కోట్లు
దేవతలు ఎగబడుచుండెనె
బీదవాని పాట్లు
తీరును ఏతీరుననె

ప్రతిభ పొగడుకుంటు
కులము పేరడిగినారు
అంటరానివాడు అంటు
దూరమెంతొ జరిగినారు

కనకాభిషేక గండపెండేరం
కళాప్రపూర్ణ గౌరవాలు
పగటిదివిటీల సత్కారం
ఏనుగుపై ఊరేగడాలు

పద్మభూషణ బిరుదులు
తనప్రతిభకు తార్కాణాలు
మెండుగ పురస్కారాలు
కళామతల్లి గుర్తులు

మాతలకు మాత
భరత మాతయని
అర్పించె జోత
భరత పుత్రుడనని

గళముకు లేదేకులం
కలముకు లేదేకులం
ఉన్నదొక్కటే కులం
మనమంతా శ్రామికులం

– అడ్డగూడి ఉమాదేవి
తెలుగు అధ్యాపకురాలు

# తెలుగు కవితా కీర్తి కిరీటం !

ఆధునిక తెలుగు
కవితా కీర్తి కిరీటం
నవయుగ కవి చక్రవర్తి
డా. గుఱ్ఱం జాషువా
అయన మార్గం
అందరికీ ఆదర్శం
ఆధునిక కవులలో
అనితర సాధ్యమైన స్థానం
ఆ మహనీయునికి అంకితం
సామాజిక భావ విప్లవం
గుఱ్ఱం జాషువా కవితా స్వరూపం
తెలుగు సాహితీ వినీల ఆకాశంలో
కవితా ధ్రువ తార
జోహారు జోహారు
అయన కవితా సందేశం
నేటి సమాజానికి ఒక మార్గ దర్శకం
పేదోడి గూటిలో...
పేదోడి నీడలో...
పేదోడి జాడలో
నడిచిన నీతి కవిత్వం
నిజాయితీ కవిత్వం
తెలుగు వాకిట్లో కవితా
జీవిత కాలంలో తెలుగు
కవితా చరిత్ర తిరగ రాసిన
మహనీయుడు గుఱ్ఱం జాషువా
తెలుగింట తెలుగు నాట,
తెలుగు నోట
మనం మరువలేని
మన నవయుగ కవితా
చక్రవర్తి గుఱ్ఱం జాషువా !
వందనం ! అభివందనం !



–లక్కరాజు ప్రఫుల్ల చంద్ర ,
63005 46700.

